RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in
# దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | సెప్టెంబర్ 9 బుధవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 216 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాషా
NALGONDA | WEDNESDAY SEPTEMBER 9 2026 | VOL:16 | ISSUE: 216 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# మోదీ ఓటమే కమ్యూనిస్టుల విజయానికి బాట!

- పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే: సీఎం రేవంత్‌రెడ్డి
- 'సర్' పేరుతో ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోంది
- కేసీఆర్.. మోదీపై పోరాటానికి కలిసి రావాలి
- సారంపల్లి మల్లారెడ్డి రైతాంగానికి దిక్సూచి: నేతల నివాళి
- సారంపల్లి పేరుతో పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తాం: సీఎం



**హైదరాబాద్, సెప్టెంబర్ 8:**

రైతాంగం, పేదలు, శ్రామికుల సమస్యలపై జీవితాంతం పోరాడిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి సేవలను పలువురు నాయకులు కొనియాడారు. సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ తదితరులు పాల్గొని నివాళు లర్పించారు. సారంపల్లి మల్లారెడ్డి రైతాంగ సమస్యలపై లోతైన అవగాహన కలిగిన నాయకుడని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. రైతులు, పేదల కోసం కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటాలు ప్రభుత్వాలను ప్రజా సమస్యల పరిష్కారం వైపు నడిపించాయని అన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

'మోదీ ఓటమే కమ్యూనిస్టుల విజయం'

దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయాలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో గెలవలేమనే ఉద్దేశంతో 'సర్' పేరుతో ఓటర్లను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. మైనార్టీలతో పాటు ఎస్సీ, ఎస్టీ వర్గాల ఓట్లను కూడా తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించాల్సి ఉండగా కేంద్రంలోని బీజేపీ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వ ఓటమే కమ్యూనిస్టుల విజయమని, పేద ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కమ్యూనిస్టులు ముందుండాలని కోరారు.

కమ్యూనిస్టుల పోరాటాలే.. ప్రజా సంక్షేమానికి పునాది

కనీస వేతనాలు, భూమిలేని పేదలకు భూమి, ఉపాధి హామీ, ఆహార భద్రత, పేదలకు ఇళ్ల వంటి అంశాలపై కమ్యూనిస్టులు దశాబ్దాలుగా పోరాడారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. కమ్యూనిస్టులు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి తమ ప్రభుత్వం సిద్ధంగా

## మోదీ సభకు పోటెత్తిన జనం.. రాహుల్ సభపై బీజేపీ సెటైర్లు

- వడోదరలో మోదీ సభకు గంటలోనే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఫుల్
- రాహుల్ సభకు డబ్బులిచ్చి జనాన్ని తెచ్చుకున్నారని బీజేపీ ఆరోపణ
- మోదీకి నిజమైన ప్రజాదరణ ఉందన్న బీజేపీ నేత అమిత్ మాలవీయ
- తప్పుడు ప్రచారమంటూ బీజేపీ ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీల ప్రజాదరణను పోలుస్తూ బీజేపీ సోషల్ మీడియాలో వ్యంగ్యాస్త్రాలు సంధించింది. మోదీ వడోదర సభకు ప్రజలు స్వచ్ఛందంగా పోటెత్తారని, కానీ రాహుల్ పుణె సభకు మాత్రం డబ్బులిచ్చి జనాలను తరలించాల్సి వచ్చిందని బీజేపీ నేత అమిత్ మాలవీయ ఆరోపించారు. ఒక నేతకు నిజమైన ప్రజాదరణ ఉందని, మరొకరికి జనాన్ని సమీకరించడానికి ప్రోత్సాహకాలు అవసరమని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మంగళవారం వడోదరలో జరగనున్న ప్రధాని మోదీ 'నమో ఫర్ వికసిత్ భారత్'



(మిగతా 2వ పేజీలో..)

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలని శాసనసభలో తీర్మానం
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణం
- కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తీర్మానంలో డిమాండ్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్ చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తాతా మధు, నవీన్ కుమార్‌లపై కాంగ్రెస్ పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తీర్మానం ప్రవేశపెట్టిన దామోదర

(మిగతా 2వ పేజీలో..)



## రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీ.. నేటి నుంచి రెండు రోజుల పర్యటన

- జిల్లా అభివృద్ధి కమిటీ (దిశ) సమావేశానికి అధ్యక్షత వహించనున్న రాహుల్ గాంధీ
- శివ్‌గఢ్, మహారాజ్‌గంజ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల సందర్శన
- యూపీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకున్న పర్యటన

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ నేడు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ పార్లమెంటరీ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందులో భాగంగా జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరును రాహుల్ సమీక్షించనున్నారు. ముఖ్యంగా ఇటీవల సంభవించిన వరదల వల్ల ప్రభావితమైన ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై అధికారులను ఆరా తీయనున్నారు. అమేథీ ఎంపీ కిశోరీ లాల్ శర్మ అధ్యక్షతన గతంలో జరిగిన 'దిశ' సమావేశం అనంతరం చేపట్టిన చర్యలపై అధికారులు ఇప్పటికే నివేదికలు సిద్ధం చేశారు.

(మిగతా 2వ పేజీలో..)



## 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

- కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం
- కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ
- ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ
- దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్




మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్

(మిగతా 2వ పేజీలో..)

## తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ సైగ... భగ్గుమన్న డీఎంకే

- తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ సైగలపై తీవ్ర వివాదం
- విజయ్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించేందుకు స్పీకర్ నిరాకరణ
- సభలో గౌరవం లోపించిందంటూ స్టాలిన్ వ్యాఖ్య

తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్ చేసిన ఒక సైగ తీవ్ర రాజకీయ దుమారం రేపింది. మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు, సైగలపై డీఎంకే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది 'బాడీ షేమింగ్' కిందకే వస్తుందని ఆరోపిస్తూ ఆ పార్టీ సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, ఎమర్జెన్సీ సమయంలో 'మిసా'

(మిగతా 2వ పేజీలో..)



## నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్

గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై

(మిగతా 2వ పేజీలో..)



RNI NO. TELTEL2010/34557 తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## సంపాదకీయం

# ప్రజా సమస్యలకు పరిష్కారమే ప్రజాపాలనకు అసలైన కొలమానం

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ పనితీరును అంచనా వేయడానికి పెద్ద పెద్ద ప్రకటనలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే ప్రమాణాలు కావు. ఒక సామాన్యుడు తన సమస్యతో ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినప్పుడు అతనికి ఎంత త్వరగా స్పందన లభించింది? అతని దరఖాస్తు ఎక్కడ ఉంది? సమస్య పరిష్కారమైందా? పరిష్కారం కాకపోతే కారణం ఏమిటి? అనే ప్రశ్నలకు అధికారులు ఇచ్చే సమాధానాలే అసలైన ప్రజాపాలనకు కొలమానం.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు నిర్వహించే ప్రజావాణి వంటి కార్యక్రమాలకు అందుకే ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. పింఛన్, భూమి, రేషన్ కార్డు, ఇల్లు, విద్య, వైద్యం, ఉపాధి వంటి అనేక అంశాలపై సామాన్యులు అధికారులను ఆశ్రయిస్తుంటారు. వీరిలో చాలామందికి ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ విభాగాన్ని సంప్రదించాలో కూడా స్పష్టంగా తెలియకపోవచ్చు. అలాంటి సమయంలో అధికారి బాధ్యత కేవలం దరఖాస్తును స్వీకరించడం కాదు.. సమస్యను సరైన శాఖకు పంపించి, దాని పురోగతిని పర్యవేక్షించి, చివరకు ఫిర్యాదుదారుడికి సమాధానం అందించడం.

### దరఖాస్తు తీసుకోవడం మొదటి అడుగే

ప్రజావాణిలో అర్జీ స్వీకరించిన వెంటనే పని పూర్తయినట్లు భావించడం సరికాదు. అసలు బాధ్యత అప్పుడే ప్రారంభమవుతుంది. దరఖాస్తు సంబంధిత శాఖకు చేరిందా? అధికారులు పరిశీలించారా? అవసరమైన పత్రాలు ఉన్నాయా? సమస్యను పరిష్కరించేందుకు ఏ చర్యలు తీసుకున్నారు? అనే అంశాలను నిరంతరం పర్యవేక్షించాలి.అధికారుల వద్ద పెండింగ్‌లో పేరుకుపోయే దరఖాస్తులు ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై అనుమానాలను పెంచుతాయి. ఒక చిన్న సమస్య కోసం కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సి వస్తే సామాన్యుడికి సమయం, డబ్బు రెండూ నష్టమే. అందుకే 'పెండింగ్' అనే పదం వెనుక ఒక మనిషి సమస్య ఉందనే విషయాన్ని అధికారులు గుర్తించాలి.

### పరిష్కారం సాధ్యం కాకపోతే కారణం చెప్పాలి

ప్రతి ఫిర్యాదును పరిష్కరించడం సాధ్యపడకపోవచ్చు. కొన్ని సమస్యలు చట్టపరమైన పరిమితులకు లోబడి ఉంటాయి. మరికొన్ని ఇతర శాఖల పరిధిలో ఉండవచ్చు. అలాంటప్పుడు దరఖాస్తును తమ వద్దే నిలిపివేయడం సరైన విధానం కాదు.సంబంధిత శాఖకు పంపించడం, పై అధికారుల దృష్టికి తీసుకెళ్లడం లేదా నిబంధనల ప్రకారం ఎందుకు పరిష్కరించలేమో ఫిర్యాదుదారుడికి స్పష్టంగా తెలియజేయడం అవసరం. సమస్య పరిష్కారం కాకపోయినా.. సరైన సమాచారం ఇవ్వడం కూడా ప్రజాసేవలో భాగమే.

### డిజిటల్ పర్యవేక్షణతో జవాబుదారీతనం

ప్రస్తుత కాలంలో ప్రతి దరఖాస్తుకు ఆన్‌లైన్ ట్రాకింగ్ వ్యవస్థ ఉండటం ఉపయోగకరం. దరఖాస్తు ఏ శాఖకు వెళ్లింది, ఎవరి వద్ద ఉంది, ఎప్పుడు పరిష్కరించాలి వంటి వివరాలు అందుబాటులో ఉంటే జవాబుదారీతనం పెరుగుతుంది. అధికారులకు కూడా పెండింగ్ దరఖాస్తులపై నిరంతరం పర్యవేక్షణ చేసే అవకాశం ఉంటుంది.అయితే సాంకేతిక వ్యవస్థ ఒక్కటే సమస్యలకు పరిష్కారం కాదు. ఆన్‌లైన్‌లో 'పరిష్కరించబడింది' అని నమోదు చేసి, వాస్తవంగా ప్రజలకు పరిష్కారం అందకపోతే ప్రయోజనం ఉండదు. రికార్డులో పరిష్కారం కాదు.. ప్రజల జీవితంలో పరిష్కారం కనిపించాలి.

### ప్రజావాణి ఫలవంతం కావాలంటే

ప్రజావాణి కార్యక్రమాన్ని కేవలం వారానికోసారి నిర్వహించే కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థగా చూడాలి. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులను సమీక్షించడం, ఎక్కువ కాలంగా పరిష్కారం కాని సమస్యలకు ప్రత్యేక దృష్టి పెట్టడం, అధికారులు తీసుకున్న చర్యలను పరిశీలించడం అవసరం.ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అంటే కార్యాలయ తలుపులు తెరిచి ఉంచడం మాత్రమే కాదు. ప్రజల సమస్యకు స్పందించడం.. పరిష్కారం చూపడం.. ఆ పరిష్కారాన్ని వారికి తెలియజేయడం. ఈ మూడు అంశాలు సమర్థవంతంగా అమలైనప్పుడే ప్రజాపాలనకు నిజమైన అర్థం వస్తుంది.ప్రభుత్వ పథకాలు ఎంత గొప్పగా ఉన్నా.. వాటి ప్రయోజనం అర్హుడైన వ్యక్తికి సకాలంలో అందకపోతే ఆ పథకం ఉద్దేశం నెరవేరదు. అందుకే ప్రజావాణి వంటి వేదికలు ప్రజల గొంతును ప్రభుత్వానికి చేరవేసే వారధులుగా మారాలి. ప్రజల ఫిర్యాదు ఒక దరఖాస్తు కాదు.. పరిష్కారం కోసం ప్రభుత్వం ముందు ఉంచిన బాధ్యత. ఆ బాధ్యతను అధికారులు ఎంత సమర్థంగా నిర్వర్తిస్తారో అదే మంచి పాలనకు నిజమైన అద్దం.

# మోదీ ఓటమే కమ్యూనిస్టుల విజయానికి బాట!

మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని స్పష్టం చేశారు.

### సారంపల్లి.. రైతాంగానికి ఎన్సైక్లోపీడియా

సారంపల్లి మల్లారెడ్డిని రైతాంగ సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న 'నడిచే ఎన్సైక్లోపీడియా'గా సీఎం అభివర్ణించారు. కౌలు రైతుల సమస్యలు, పంటలకు గిట్టుబాటు ధర, వ్యవసాయ రంగ సమస్యలపై ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. సారంపల్లి రచనలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సారంపల్లి పేరుతో పరిశోధనా కేంద్రం సారంపల్లి మల్లారెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచేలా ఒక పరిశోధనా కేంద్రానికి ఆయన పేరు పెట్టాలని ప్రభుత్వం భావిస్తోందని సీఎం ప్రకటించారు. దీనిపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### 'సర్'తో ప్రజల హక్కులకు ముప్పు

సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ 'సర్' పేరుతో దేశవ్యాప్తంగా ఓటర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇది ఓటుహక్కుపైనే దాడి అని విమర్శించారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని కాపాడేందుకు వామపక్ష శక్తులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సారంపల్లి జీవితం ఆదర్శనీయం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ తాడిత, పీడిత, శ్రామిక వర్గాల విముక్తి కోసం సారంపల్లి తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. సోషలిస్టు సమాజ స్థాపన కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సారంపల్లి సకలగుణ సంపన్నుడని, వ్యవసాయం, ప్రాజెక్టులు, రైతాంగ సమస్యలపై అపారమైన పరిజ్ఞానం కలిగిన నాయకుడని కొనియాడారు. ఎర్రజెండా పార్టీలన్నీ ఐక్యంగా ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు.

### సీపీఐ(ఎం) నేతలతో ప్రత్యేకంగా భేటీ

అసెంబ్లీ సమావేశాల అనంతరం సీపీఐ(ఎం) ప్రతినిధి బృందంతో స్వయంగా సమావేశమవుతానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పేదలు, రైతులు, ఇతర వర్గాల సమస్యల పరిష్కారంపై వారితో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

### 'నా నాగేటి సాళ్లు' ఆవిష్కరణ

సారంపల్లి మల్లారెడ్డి స్వీయ రచన 'నా నాగేటి సాళ్లు' పుస్తకాన్ని ప్రకాశ్ కరత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు, వామపక్ష పార్టీల ప్రతినిధులు, సారంపల్లి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మోదీ సభకు పోటెత్తిన జనం.. రాహుల్ సభపై బీజేపీ సెటైర్లు

మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో ఉచిత రిజిస్ట్రేషన్లు ప్రారంభించిన గంటలోనే సీట్లన్నీ నిండిపోయాయి. బుక్‌మైషో ప్లాట్‌ఫామ్ ద్వారా ఈ ప్రక్రియను నిర్వహించగా, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్టులో ఉండిపోయారు. ప్రధాని సభకు డిజిటల్ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు నిర్వహించడం ఇదే తొలిసారి.గత నెలలో పుణెలో రాహుల్ గాంధీ విద్యార్థుల కోసం నిర్వహించిన 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమాన్ని ఉద్దేశించి మాలవీయ ఈ విమర్శలు చేశారు. ఆ సభకు హాజరయ్యేందుకు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు రూ.25,000 నుంచి రూ.35,000 వరకు చెల్లించారని బీజేపీ ఆరోపించింది. దీన్ని 'పైసే కీ గూంజ్' (డబ్బుల హోరు) అని కూడా విమర్శించింది. అయితే, బీజేపీ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. యువత నుంచి రాహుల్ సభకు వస్తున్న స్పందన చూసి బీజేపీ భయపడుతోందని, అందుకే ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తోందని ఎదురుదాడి చేసింది. ఈ చెల్లింపుల ఆరోపణలపై ఎలాంటి స్వతంత్ర విచారణ జరగలేదని, ఇవి కేవలం రాజకీయ ఆరోపణలుగానే మిగిలిపోయాయి. కాగా, వడోదర పర్యటనలో ప్రధాని మోదీ సుమారు రూ.35,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

# 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి)

ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు.అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

# నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

మొదటి పేజీ తరువాయి)

ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీ.. నేటి నుంచి రెండు రోజుల పర్యటన

అనంతరం రాహుల్ గాంధీ శివ్‌గఢ్, మహారాజ్‌గంజ్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించనున్నారు. స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, వరద నష్టాన్ని స్వయంగా అంచనా వేయనున్నారు. ఉత్తరప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాహుల్ పర్యటన రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించేందుకు ఈ పర్యటన దోహదపడనుంది. కాగా, రాహుల్ గాంధీ చివరిసారిగా ఈ ఏడాది మే 19, 20 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లో పర్యటించారు. ఆ సమయంలో రాయ్‌బరేలీలోని బచ్‌రావాన్‌లో తన ఎంపీ నిధులతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు.

# తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ సైగ... భగ్గుమన్న డీఎంకే

చట్టం కింద స్టాలిన్ అరెస్ట్ అయిన ఉదంతాన్ని ప్రస్తావించారు. ఈ క్రమంలో తన కుడి అరచేతిని దవడకు ఆనించి మాట్లాడటం వివాదాస్పదమైంది. అత్యవసర పరిస్థితి కాలంలో పోలీసుల దాడిలో స్టాలిన్ దవడ పగిలిందన్న విషయాన్ని ముఖ్యమంత్రి ఎగతాళి చేశారని డీఎంకే నేతలు ఆరోపించారు.ముఖ్యమంత్రి విజయ్ వ్యాఖ్యలను సభాపతి రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ డీఎంకే ఎమ్మెల్యేలు స్పీకర్ జేసీడీ ప్రభాకర్ చాంబర్ ఎదుట బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో మార్షల్స్ వారిని బలవంతంగా బయటకు పంపాల్సి వచ్చింది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఇతరుల శారీరక స్థితిని హేళన చేయడం అత్యంత దారుణమని సీపీఎం నేత పి. షణ్ముగం ఖండించారు.ఈ వివాదంపై ముఖ్యమంత్రి విజయ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రసంగించే క్రమంలో అనుకోకుండా నా బాడీ లాంగ్వేజ్ అలా వచ్చింది తప్ప, అది ఉద్దేశపూర్వకంగా చేసింది కాదు. వ్యక్తిగతంగా ఎవరినీ కించపరిచే ఉద్దేశం నాకు లేదు. దీనిని హేళనగా భావించవద్దని కోరుతున్నాను" అని ఆయన తన పోస్టులో వివరణ ఇచ్చారు.అయితే, ముఖ్యమంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించేందుకు స్పీకర్ ప్రభాకర్ నిరాకరించారు. మరోవైపు, స్టాలిన్‌ను అసలు 'మిసా' కింద అరెస్ట్ చేయలేదని, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారనే కారణంతోనే అరెస్ట్ చేశారని రాష్ట్ర మంత్రి సీటీఆర్ నిర్మల్ కుమార్ వాదించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, అసెంబ్లీ తన గౌరవ మర్యాదలను కాపాడుకుంటూ నడుస్తోందా? అని ఎం.కె. స్టాలిన్ ప్రశ్నించారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

మొదటి పేజీ తరువాయి)

స్పీకర్‌పై అగౌరవంగా మాట్లాడటంతో పాటు, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ, ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని, దానిని కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకూడదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, కానీ రాజ్యాంగబద్ధమైన పదవులను, వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని స్పష్టం చేశారు. "స్పీకర్ పదవి ఏ ఒక్క కులానికో, మతానికో సంబంధించినది కాదు. ఆ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని నేరం" అని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని, ప్రజాజీవితంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. మంత్రి దామోదర ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పూర్తి మద్దతు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో ఈ తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, అధికారిక కాపీని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై మండలిలో చర్యలు తీసుకున్నారు.

RNI NO. TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# విద్యుత్ ఉద్యమ అమరుడు సత్తెనపల్లి రామకృష్ణకు ఘన నివాళి





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 08 (దేశ టైమ్స్):**

విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన సీపీఎం నాయకుడు సత్తెనపల్లి రామకృష్ణ 26వ వర్ధంతిని బోనకల్ మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకుడు, జిల్లా మాజీ కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 2000 ఆగస్టు 28న హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటంలో పోలీసుల కాల్పులకు సత్తెనపల్లి రామకృష్ణ తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సెప్టెంబర్ 8న మృతి చెందారని పేర్కొన్నారు. అదే ఘటనలో మరో ఇద్దరు కూడా ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ప్రజలపై విద్యుత్ భారాలను మోపవద్దంటూ సాగిన ఉద్యమంలో రామకృష్ణ చేసిన త్యాగం మరువలేనిదని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రామకృష్ణ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు రామకృష్ణ చిత్రపటానికి పూలతో నివాళులర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో దొండపాటి నాగేశ్వరావు, కిలారు సురేష్, బంధం శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సునీత, గుగులోతు నరేష్, కొమ్మినేని నాగేశ్వరరావు, దొండపాటి సత్యనారాయణ, చిట్టిమోదు నాగేశ్వరరావు, తెల్లాకుల శ్రీనివాస్, దొప్ప కొరివి వీరభద్రం, డాక్టర్ కొంగర భూషయ్య, ఏసుపోగు బాబు, దుబా భద్రాచలం, మచ్చ గురవయ్య, బొడ్డుపల్లి కోటేశ్వరరావు, బంక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 08 (దేశ టైమ్స్):**

దివ్యాంగులు తమ హక్కులను తెలుసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి పి. దేవి మానస సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ దివ్యాంగ బాలుర వసతి గృహంలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని దివ్యాంగులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దేవి మానస మాట్లాడుతూ.. దివ్యాంగులు స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. దివ్యాంగజన్ కౌశల్ వికాస్ పథకం ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు, దివ్యాంగజన్ రోజ్‌గార్ సేతు ద్వారా అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే దివ్యాంగుల హక్కుల చట్టం--2016 ద్వారా కల్పించిన హక్కులు, రక్షణలు, సమాన అవకాశాల గురించి వివరించారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రత తదితర రంగాల్లో దివ్యాంగుల కోసం అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హత ఉన్న ప్రతి దివ్యాంగుడు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందేందుకు ముందుకు రావాలని ఆమె కోరారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎ. ప్రమీల, డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాదులు, సంబంధిత శాఖల సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**ఆరు గ్యారెంటీలు.. 420 హామీల అమలు ఏదీ?**

**మాజీ మంత్రి రెడ్యానాయక్ ఆధ్వర్యంలో చిన్నగూడూరులో బీఆర్ఎస్ నిరసన**

**దేశ టైమ్స్ మహబూబాబాద్ సెప్టెంబర్ 8:**





ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చిన్నగూడూరు మండల కేంద్రంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి రెడ్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రెడ్యానాయక్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును విస్మరించిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, పెండింగ్‌లో ఉన్న హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలు అంశాన్ని ప్రధానంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరును ఖండించిన రెడ్యానాయక్ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులు వ్యవహరించిన తీరును కూడా మాజీ మంత్రి రెడ్యానాయక్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమానుషంగా వ్యవహరించారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల చీరలు లాగడం, మెడ పట్టుకుని బయటకు గెంటడం వంటి చర్యలకు పాల్పడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల బాధ్యత అని, వారి గొంతును అణచివేసే ప్రయత్నాలు సరికావని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని మాజీ మంత్రి రెడ్యానాయక్ డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు వ్యాఖ్యలను ఖండించిన బీఎస్పీ

**రుద్రంగి సెప్టెంబర్ 8 (దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు దయ్యాల ఉదయ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అసభ్య పదజాలంతో చేసిన వ్యాఖ్యలను నాయకులు తీవ్రంగా ఖండించారు. స్పీకర్ పదవికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు గౌరవం ఇవ్వాలని సూచించారు. బీఆర్ఎస్ మొదటి నుంచి దళితుల పట్ల వ్యతిరేక వైఖరిని అవలంబిస్తోందని బీఎస్పీ నాయకులు ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయలేదని విమర్శించారు. నేరెళ్ల ఘటనలో దళితులపై జరిగిన పరిణామాలు, దళిత బంధు పథకం విషయంలో జరిగిన పరిణామాలను దళిత సమాజం మరచిపోలేదన్నారు. దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాత మధు చేసిన పరుష వ్యాఖ్యలకు బీఆర్ఎస్ పార్టీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కట్కూరి రమేష్, సీనియర్ నాయకులు కట్కూరి శంకర్, మండల సలహాదారు కదాసు అనిల్, మండల ఉపాధ్యక్షుడు ఏనుగందుల సతీష్, రుద్రంగి గ్రామ ప్రధాన కార్యదర్శి లింగాల రవీందర్, దేశవేని గంగాధర్, కట్కూరి హనోక్ తదితరులు పాల్గొన్నారు.

## రుద్రంగిలో భారీ కొండచిలువలు ప్రత్యక్షం

**రుద్రంగి సెప్టెంబర్ 8 (దేశ టైమ్స్)**



భారీ కొండచిలువ ప్రత్యక్షం రుద్రంగి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ సమీపంలో బారి కొండచిలువ రోడ్డు పైకి వచ్చింది దానిని చూసిన ప్రజలు ఎక్కడ ప్రాణహాని చేస్తుందో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఫారెస్ట్ అధికారులు కొండ చిలువను పట్టుకోవలని భక్తులు కోరుతున్నారు. అలాగే మొన్న చర్చ్ దగ్గర కూడా భారీ కొండ చిలువ రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురై దానిని చంపడం జరిగింది అటవీ ప్రాంతం ఎక్కువగ ఉండడంతో తరచు జనవసాల్లోకి కొండ చిలువలు వస్తున్నాయని ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు......

## ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఉమ్మడి జడ్పి చైర్మన్ తుల ఉమ

**రుద్రంగి సెప్టెంబర్ 8 (దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రనికి చెందిన మహ్మద్ సదుల్లా,హసీనా,రీమ్స,హసీనా గత 20 రోజుల క్రితం కారు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాలను బిఆరెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లా జడ్పి చైర్మన్ తుల ఉమ పరామర్శించారు. ఒకే ప్రమాదంలో నలుగురు మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ కుటుంబానికి మనోధైర్యం కలిపించాలని ప్రార్థించారు. కథలపూర్ లో షాప్ నడిపిస్తూ సదుల్లా అందరితో కలిసి మెలిసి ఉండేవాడని ఆపదలో ఉన్న వారికి సహాయం చేసేవాడని గుర్తు చేశారు. తుల ఉమ వెంట సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం,మాజీ ఎంపిటీసి మంచే రాజేశం,వార్డు మెంబర్లు ఉప్పులూటీ గణేష్,చెప్యాల గణేష్,గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమలకర్,నాయకులు పుదరి శ్రీనివాస్,ఆకుల గంగారాం,బొడ్డు మల్లేశం,అల్లూరి గంగారెడ్డి,కదాసు లక్ష్మణ్,తర్రె గంగారెడ్డి,వెంగల మల్లికార్జున్,ఉన్నారు.

## కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన /బిఆరెస్ పార్టీ నాయకులు

**రుద్రంగి సెప్టెంబర్ 8 (దేశ టైమ్స్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో నిన్నటి రోజున కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను బిఆరెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మండల అధ్యక్షుడు దెగవత్ తిరుపతి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి మంచే రాజేశం, మాట్లాడుతూ. బిఆరెస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి మరీనా అవకాశవాదులు బీఆర్ఎస్ పార్టీని విమర్శించడం సిగ్గుచేటని నన్నారు. ఆనాడు బిఆరెస్ పార్టీలో ఉండి అభివృద్ధి పనులు చేసిన నాయకులు రుద్రంగి ని బిఆరెస్ పార్టీ అభివృద్ధి చేయలేదని చెప్పడం వారి విజ్ఞతకే వొదిలేస్తున్నమని అన్నారు. అవకాశవాదులకు బిఆరెస్ పార్టీని విమర్శించే హక్కు లేదని అన్నారు. ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే అయితే గ్రామ ప్రజలకు ఎలా అదృష్టమో కాంగ్రెస్ నాయకులు చెప్పాలని ప్రశ్నించారు. వార్డు మెంబర్ స్థాయి వ్యక్తులు ఎమ్మెల్యే ను ప్రశ్నించకూడదా అని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి పౌరుడికి ఎమ్మెల్యే ను ప్రశ్నించే హక్కు ఉంటుందని కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలని హితువు పలికారు. బిఆరెస్ పార్టీ చేసిన అభివృద్ధి ని మిరే చేసినట్టు చెప్పుకుంటున్నారని అన్నారు. ఎమ్మెల్యే మెప్పు కోసమే కాంగ్రెస్ నాయకుల తాపత్రయం అని అన్నారు. ఆది శ్రీనివాస్ మంత్రి కావాలని కొందరు మానాల నాయకులు హోమాలు చేస్తున్నారని. మరి ఉమ్మడి మానాల కు ప్రభుత్వ విప్ ఎం చేశారో చెప్పాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు మూడేండ్లలో ఎం అభివృద్ధి చేసారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో,వార్డు మెంబర్లు,ఉప్పులూటీ గణేష్,చెప్యాల గణేష్,గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్,కంటే రెడ్డి,ఏనుగుల రాజు,అల్లూరి గంగారెడ్డి,ఆకుల గంగారాం, పాల్గొన్నారు.



RNI NO. TELTEL2010/34557

తెలుగు దినపత్రిక

దేశ టైమ్స్

సత్యం కోసం .... సమాజం కోసం

## ఇందిరమ్మ ఇల్లు అందడంతో కుటుంబంలో ఆనందం

### నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**బోనకల్, సెప్టెంబర్ 08 (దేశ టైమ్స్):**



బోనకల్ మండల కేంద్రంలోని భూక్య బోడికి కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడంతో నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. భూక్య బోడి, ఆయన కుమారుడు భూక్య గోపి, కోడలు స్వాతి నూతన గృహంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇల్లు తమ కుటుంబానికి ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు. సొంతింటి కలను సాకారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మధిర నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతూ ప్రభుత్వం ముందుకు సాగాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు. ఇందిరమ్మ ఇల్లు తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, ప్రభుత్వం అందించిన ఈ సహాయాన్ని ఎప్పటికీ మరువలేమని తెలిపారు. నూతన గృహప్రవేశ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో యార్లగడ్డ కృష్ణయ్య, మరీదు శీను, యార్లగడ్డ చిన్న నరసింహ, గుగులోతు చందు, అన్నిపాక అరుణ్, మోర్ల వంశీ, గుగులోతు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఘనంగా భూమి పూజ

**రుద్రంగి సెప్టెంబర్ 8 (దిశ టైమ్స్)**



రుద్రంగిలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇంటి నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్ ద్వారా మంజూరైన ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. లబ్ధిదారురాలు పిల్లమారపు దివ్య, భర్త కిషోర్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు తర్రె లింగం, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, సర్పంచ్ గండి లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గట్ల మీనయ్య, వార్డు సభ్యులు పుటుకపు మహిపాల్, నాయకులు గంగరాజం, ఎర్రం రాజలింగం, చెలుకల శ్రీకాంత్, పూదరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో, సమన్వయంతో విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.

**దేశ టైమ్స్‌మహబూబాబాద్, సెప్టెంబర్.08**

జిల్లాలో వినాయక నిమజ్జన వేడుకలను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తో కలిసి, వినాయక నిమజ్జన వేడుకలపై రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, పోలీస్ తదితర శాఖల ఉన్నతాధికారులతో నిమజ్జన ఏర్పాట్లపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించి, కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాల్లో, నిమజ్జన ఘాట్ల వద్ద పోలీస్ శాఖ పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి, సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా రూట్ డైవర్షన్ ప్రణాళికలు అమలు చేయాలన్నారు. విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, గుంతల పూడ్చివేత పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులను షిఫ్టుల వారీగా నియమించాలి. ఊరేగింపు మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సంబంధిత శాఖల వారు సరిచేసి, ఎత్తు పెంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్‌తో పాటు ఘాట్ల వద్ద అదనపు జనరేటర్లు, హైమాస్ట్ లైట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బంది కలగకుండా, క్రేన్లు సులభంగా నిలిచేందుకు మరియు విగ్రహాలు నీటిలో సరిగ్గా మునిగేందుకు నిమజ్జన పాయింట్ల వద్ద పూడిక తీత పనులు చేపట్టాలని అన్నారు. ఇరిగేషన్ అధికారులు నిమజ్జనం జరిగే చెరువులు, జలాశయాలు లేదా కాలువల్లో తగినంత నీటి మట్టం ఉందో లేదో పర్యవేక్షించి మండల అధికారులను సమన్వయం చేసుకొని నివేదికలు అందజేయాలని అన్నారు. ప్రమాదాలు జరగకుండా ఘాట్ల వద్ద బలమైన బారికేడింగ్, గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లతో కూడిన ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లను మోహరించాలన్నారు. అగ్నిమాపక శకటాలను (ఫైర్ ఇంజిన్లు) ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు. మండప నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు అనుగుణంగా నిమజ్జనం పూర్తి చేయాలని అన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లు పంచాయతీ కార్యదర్శులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లపై కార్యాచరణ రూపొందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. నిమజ్జనం పూర్తయిన తరువాత ఘాట్ల వద్ద, ప్రధాన రహదారులపై మున్సిపల్ మరియు పంచాయతీ సిబ్బంది సహాయంతో మట్టి, వ్యర్థాలు, పూజా సామగ్రిని తొలగించి శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి అనుమతి పొందాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్.ఓ. నాగావాణి, డి.ఆర్.డి.ఓ మంధ్ంనవాధ్నరాజు, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓ లు రాజేశ్వరీ, గణేష్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఆరోగ్య మహిళతో.. మహిళల ఆరోగ్యానికి భరోసా








### ముందస్తు పరీక్షలతో వ్యాధులను ముందే గుర్తిస్తున్న ప్రభుత్వం

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 08 (దేశ టైమ్స్):**

మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమం ఖమ్మం జిల్లాలో మహిళలకు అండగా నిలుస్తోంది. ముందస్తు పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స, రిఫరల్, ఫాలోఅప్ సేవలను ఒకే వ్యవస్థలో అందిస్తూ మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పర్యవేక్షణలో ప్రభుత్వ వైద్య విభాగం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోంది. ప్రతి మంగళవారం, గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. ఓపీ నమోదు నుంచి వైద్య పరీక్షలు, స్క్రీనింగ్, వ్యాధి నిర్ధారణ, అవసరమైన వారికి ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫరల్, చికిత్స అనంతరం ఫాలోఅప్ వరకు సేవలను అందిస్తున్నారు.

ఇంటికి చేరువలోనే సమగ్ర వైద్య పరీక్షలు

మహిళలు తమ ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సమీపంలోని ప్రభుత్వ వైద్య కేంద్రాల్లోనే ఆరోగ్య మహిళ సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రాథమిక పరీక్షలతో పాటు అవసరాన్ని బట్టి మామోగ్రామ్, పాప్‌స్మియర్, రక్త పరీక్షలు, అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా 35 సంవత్సరాలు పైబడిన మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. రొమ్ములో గడ్డలు, ఇతర అనుమానాస్పద లక్షణాలను గుర్తించిన వారికి ఎఫ్ఎన్ఏసీ, కాల్పోస్కోపీ, బయాప్సీ వంటి తదుపరి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

49,202 ఓపీ సేవలు

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. నరేందర్ పర్యవేక్షణలో ఆరోగ్య మహిళ సేవలను మరింత బలోపేతం చేస్తున్నారు. 2023 మార్చి 8 నుంచి 2026 ఆగస్టు 31 వరకు 49,202 ఓపీ సేవలు నమోదయ్యాయి. ఈ కాలంలో 4,900 పాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించగా 264 కేసుల్లో అసాధారణ ఫలితాలు గుర్తించారు. 6,102 మామోగ్రామ్ పరీక్షల్లో 973 కేసుల్లో, 9,149 అల్ట్రాసౌండ్ పరీక్షల్లో 2,872 కేసుల్లో అసాధారణ ఫలితాలు నమోదయ్యాయి. అనుమానాస్పద ఫలితాలు వచ్చిన వారిని అక్కడితో వదిలేయకుండా తదుపరి పరీక్షలు, వైద్య సేవలకు అనుసంధానం చేస్తున్నారు. కాల్పోస్కోపీ ద్వారా 245 మందికి సేవలు అందించగా, 22 మందికి క్రయోథెరపీ నిర్వహించారు.

260 మందిలో క్యాన్సర్ గుర్తింపు

ముందస్తు స్క్రీనింగ్ ప్రాధాన్యతను ఖమ్మం జిల్లాలో నమోదైన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 260 మందిలో వివిధ రకాల క్యాన్సర్ లేదా క్యాన్సర్‌కు సంబంధించిన వ్యాధులను గుర్తించారు. వీరిలో 95 మందిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా, 165 మందిని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ద్వారా గుర్తించారు. గుర్తించిన కేసుల్లో 109 రొమ్ము క్యాన్సర్, 82 సర్వైకల్ క్యాన్సర్ కేసులు ఉన్నాయి. వీటితో పాటు థైరాయిడ్, అండాశయం, నోరు, ఉదరం, రెక్టం, ఎండోమెట్రియం, కాలేయం, నాలుక, ఎముకలు, ఊపిరితిత్తులు, మూత్రాశయం, గొంతు తదితర ప్రాంతాలకు సంబంధించిన క్యాన్సర్ కేసులను కూడా వైద్యులు గుర్తించారు.

నిర్ధారణతో ఆగకుండా.. చికిత్స వరకు పర్యవేక్షణ

ఆరోగ్య మహిళ కార్యక్రమం కేవలం స్క్రీనింగ్‌కే పరిమితం కాకుండా వ్యాధి నిర్ధారణ, చికిత్స, తదుపరి పర్యవేక్షణ వరకు కొనసాగుతోంది. గుర్తించిన క్యాన్సర్ కేసులను అవసరమైన చికిత్స కోసం హైదరాబాద్‌తో పాటు ఇతర ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేస్తున్నారు. కీమోథెరపీ, రేడియోథెరపీ వంటి చికిత్సలు పొందుతున్న వారికి నిరంతర ఫాలోఅప్ సేవలు అందిస్తూ, వైద్య సిబ్బంది వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

మహిళలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

మహిళలు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు పరీక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా 35 సంవత్సరాలు పైబడిన మహిళలు ఎటువంటి లక్షణాలు లేకపోయినా క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం ఉంటుంది. ప్రతి మంగళవారం, గురువారం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న ఆరోగ్య మహిళ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. ముందస్తు పరీక్ష.. ముందస్తు గుర్తింపు.. సకాలంలో చికిత్స ––– ఆరోగ్యకరమైన జీవనానికి ఇదే మార్గం. "మీ ఆరోగ్యం కోసం రెండు రోజులు.. మర్చిపోవద్దు" అనే సందేశంతో మహిళలు ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని వైద్య విభాగం కోరుతోంది.

# తాగునీటి అవసరాలకే సాగర్, గోదావరి జలాలకు తొలి ప్రాధాన్యం













### నీటి ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి: కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం, సెప్టెంబర్ 08 (దేశ టైమ్స్):**

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న సాగర్, గోదావరి జలాలను తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీటి అవసరం లేని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పల్లెగూడెం ఎన్ఎస్‌పీ లింక్ కాలువ పునరుద్ధరణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువుకు నీరు చేరే మార్గాన్ని పరిశీలించి, కాలువ, తూముల మరమ్మతు పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలువ ప్రస్తుత పరిస్థితి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువు వరకు ఉన్న దూరం, నీరు సజావుగా ప్రవహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ ఆరా తీశారు. కాలువ, తూము పునరుద్ధరణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని, తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆరా**

ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండల పరిధిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై కూడా కలెక్టర్ సమీక్షించారు. నోటీసులు అందుకున్న ఓటర్లలో ఒక్కరూ విచారణకు హాజరు కాకుండా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు.

**నీటి ప్రవాహాలపై నిరంతర నిఘా**

అనంతరం రఘునాథపాలెం మండలంలోని వి.వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద నీటి పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న నీటి లభ్యత, తాగునీటి సంరక్షణ, వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాలపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సూపర్ ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో గోదావరి, కృష్ణా బేసిన్‌ల పరిధిలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్నందున నీటి వినియోగంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. గోదావరి, సాగర్ నుంచి జిల్లాకు వస్తున్న నీటిని తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. కాలువలు, రెగ్యులేటర్లు, అవుట్‌లెట్లను నిరంతరం తనిఖీ చేస్తూ నీటి ప్రవాహంలో అంతరాయాలు లేకుండా చూడాలని ఆదేశించారు. నీటి లభ్యతకు అనుగుణంగా చెరువులను నింపేందుకు ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ పర్యటనలో ఇరిగేషన్ సీఈ వాసంతి, ఖమ్మం ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవో శ్రీనివాస్, వైరా ఈఈ బాబురావు, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, తహసీల్దార్లు వినయేందర్ రెడ్డి, అరుణ, ఇరిగేషన్ ఏఈ విక్రమ్‌తో పాటు మున్సిపల్, ఇరిగేషన్ శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280